**మోహన్ సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో నా శ్రమ ఎంతో కొంత ఉన్నదని వొకప్పుడు గర్వపడేవాణ్ని. ఆ గర్వం ఎంతోకాలం** నిలవ లేదు. కారణం ఇది—

"గౌరి" అందగత్తె. మనిషి నల్లగా ఉన్నా ముఖంలో కళ ఉంది పెద్దగా ఉండే కళ్ళు, ప్రత్యేకమైన పలువరస, నవ్వినప్పుడు బుగ్గలు సొట్టలు పడతాయి మరీ అంత పొట్టి కాకుండా మధ్యస్తంగా ఉంటుంది. ఇదీ 'గౌరి' బాహ్య సౌందర్యం. తనకి పురమాయించిన పనిని సక్రమంగా శుభ్రంగా చేస్తుంది. ఎవ్వరితోనూ అతిగా మాట్లాడదు, ఇంకొకరి పనిలో జోక్యం కల్పించుకోదు.

"గౌరి" మేము పనిచేస్తున్న నాటురోడ్డు పనికి వచ్చేది. భర్త గంగులు ఒక గ్యాంగు మేస్త్రీ. గంగులు ఆకారమే భయంకరం. వాడిచూపులు మరీ భయంకరం. వాడి మాటంటే గ్యాంగు వాళ్ళకి వేదవాక్యం. అతను చెప్పేదే చేస్తారు. మరోలా చెప్పాలంటే, ఆముతా అంతటికి గంగులు మకుటంలేని మహారాజు లాంటివాడు. గంగులంటే అందరికి చనువే కాని పని దగ్గర మాత్రం చనువుకాదు. గంగులు పని చేసే చోటుకు ప్రక్కగా ఉన్నదే వాళ్ళ ఊరు. అందుకనే కాంట్రాక్టరు చలపతిరావు, వాళ్ళను పిలిపించాడు. కాంట్రాక్టరు నాతో చాలాసార్లు చెప్పాడు. "వాళ్ళ గ్యాంగు బాగా పనిచేస్తున్నది" అని.

ఆరోజు ఆకాశమంతా మబ్బులు పట్టి ఉంది. వాన వచ్చేలా వుంది. ఆరోజు అనుకున్న పని పూర్తిచేద్దామని త్వర పడుతున్నాం. ఆరోజే "ప్రాజెక్ట్ ఇంజనీరు" గారు వచ్చారు గంగులు ధైర్యంగా ఇంజనీరుగారితో మాట్లాడుతున్నాడు. గంగులికి ఎవరిని ఎలా గౌరవించాలో, ఎవరి దగ్గర ఎలా మాట్లాడాలో బాగా తెలుసు.

రెండు మూడు రోజులకు ఒకసారి వచ్చి సైట్ మీద గంట కన్నా ఎక్కువ సేపు ఉండని ఇంజనీరు గారు ఆరోజల్లా ఉండేటట్టున్నారు. మాటల్లో టైమ్ తెలియడం లేదేమో!

వర్షం వచ్చేసింది. గాలికూడా ఉధృతంగానే ఉంది అన్నీ తాటిచెట్లే అవడంవల్ల అందరూ తలా ఒక చెట్టుదగ్గరికి వెళ్ళారు.

చాలా సేపు వర్షం కురిసింది. ఇంజనీరు గారున్న చెట్టు క్రిందనే "గౌరి" కూడా ఉంది. 'గౌరి"తో మాట్లాడు తున్నట్లున్నాడు ఇంజనీరు. ఎవరన్నా చూస్తే తప్పుగా భావిస్తారన్న అనుమానం నాకొచ్చింది.

ప్రాజెక్టు ఇంజనీరు గారు రోజూ వస్తూ "గౌరి"కి ఎదురుగా కూర్చోవడమే కారణం. నేను ఆశ్చర్యపోయాను ఇంజనీరు గారి వయస్సు ఎక్కడ? దాదాపు 45 పైన ఉంటాయి. ఛ! యివేం పాడుబుద్ధి ఈయనకి అనుకున్నా. కాని పూర్తిగా నేను దానిని నమ్మలేక పోతున్నా. నా మటుకు నాకు మంచిగా ఆలోచిద్దామన్నా, చెడుగానే తోస్తుంది మరి!

సందర్భం పడినప్పుడల్లాఅనే వాడు కాంట్రాక్టరు "ఇంజనీరు గారి బుద్ధి చెడిపోయింది, ఇలాగే ప్రవర్తిస్తేచాలా పెద్ద దెబ్బ తింటాడు" అని. ఇతని దాకా వచ్చిందా ఆ మాట అను

# శాపగ్రస్తుడు

కున్నాను.

ఆ మాటలో ఈర్ష్య, పగ, ఉన్నట్టు న్నాయి. కాంట్రాక్టరుకూ ఇంజనీరు గారికీ మాట పట్టింపు వచ్చిన సందర్భాలు కూడా లేకపోలేదు. అందుకేనేమో ఈ ప్రచారం చేస్తున్నాడు కాంట్రాక్టరు చలపతిరావు.

మరో వారం రోజులు గడిచాయి. నేను వర్క్‌షాప్ దగ్గరికి వెళ్ళాను. గంగులు, చలపతిరావు ఏదో మాట్లాడుకుంటున్నారు, నేను వెళ్ళగానే వారి సంభాషణ ఆగిపోయింది. ఇట్లా నాలుగైదు సార్లు జరిగింది వీరిద్దరికి ఇంత స్నేహం ఎప్పుడు కుదిరిందా అనుకున్నాను.

"ఏం గంగులూ ! ఇక్కడే తిష్ట వేశావు పనేమీ లేదా ?" అన్నాను నవ్వుతూనే.

"ఊరికనే ఊసిపోక ఇక్కడికి వచ్చాను దొరా ?" అన్నాడు నవ్వుతూ.

కాంట్రాక్టరు ఋత్రీతి కలిపాడు. ఆనవ్వులో ఈర్ష్య, కక్ష, హేళన, కలిసి ఉన్నట్టనిపించింది నాకు.


గంగులు వెళ్ళటానికి బయలు దేరాడు. నాలుగడుగులు వెయ్యగానే చలపతిరావు పిలిచాడు. "మొన్న ఎందుకో డబ్బులడిగావే' ఇది తీసుకుపో తరువాత లెక్క చూసుకుందాం లే" అంటూ ఇరవై రూపాయలనోటు అందించాడు.

* * *

నేను ఎంత కాదనుకున్నా నా మనసు కీడును శంకిస్తున్నది. ఇటు ఇంజనీరు గారి ప్రవర్తన, అటు గంగులు చలపతిరావుల స్నేహం చూస్తుంటే అలా అనిపించింది నాకు.

ఒకనాడు గంగులు పనిమాని మా

రావూరి రవీంద్రనాథ్



యింటికి వచ్చాడు. కోపంతో ఊగిపోతున్నాడు. మొఖం ఎర్ర బారి ఉంది !

"ఏం గంగులూ ?" అన్నాను.

"ఏం లేదు దొరా ! మా యింటిది, ఇయ్యాల పగ తీర్చుకున్నాలే !" కోపంతో ఏం మాట్లాడుతున్నదీ అతనికి తెలియడం లేదనిపించింది నాకు.

నాకు భయం వేసింది వెధవ చంపాడేమో నని.

"ఏమైంది గంగులూ ?" గాభరాగా అడిగాను.

"ఏమీ లేదుదొరా ! మన ప్రాజెక్టు ఇంజనీరు గారు దాన్ని పిలిపించడం, ఇయ్యాల కూడా నిజం చెప్పలేదు. ఆ రోజే తెలిసుంటే వాణ్ణి ముక్కలుగా కోసుండే వాణ్ణి. ఇయ్యాల ఇంటికి కూడా పోబుద్ధి కావడం లేదు దొరా !"

నాకు కోపం వచ్చింది ఇంజనీరు గారి మీద. "ఎంతో మర్యాదస్తుడు. ఇలాంటి పాడు పనులు చేయడమా? అందులోనూ ఇలాంటి అమాయకులను బాధ పెట్టడమా?" అని అనిపించినా కొంచెం తగ్గాను నేను తప్పుగా భావించు కొంటున్నా నేమోనని.

"నీ కెవరు చెప్పారు గంగులూ ?" శాంతంగానే అడిగాను.

"కాంట్రాక్టరు గారు. ఆయన చెప్పబట్టే ఇప్పటి కన్నా తెలిసింది" అన్నాడు వాడు ఊగిసలాడుతూ.

నాకు కొంత వరకు నిజం తెలిసింది.

"చెప్పుడు మాటలు విని అలా తొందర పడవచ్చా? చాలా తొందర పడ్డావుగంగులూ. నిజం పూర్తిగా తెలుసుకోకుండా చేశావు. గౌరి సంగతి నీకు తెలియంది కాదు. అయినా ఇంజనీరు గారు చిన్నవాడా? ఆయనకూ మన మర్యాదలు తెలుసుగా ! కొంచెం కూడా ఆలోచించ కుండా పాడు పని చేశావు."

తరువాత అనుకున్నా ఇలాంటి వాటిల్లో జోక్యం చేసుకోవడం అంత మంచి పని కాదని.

గంగులు తరువాత ఏమి మాట్లాడ లేదు కొంచెం సేపు ఉంది "ఇక వత్తాను దొరా!" అంటూ వెళ్ళి పోయాడు.

* * *

రోజూ వర్షం పడటం మూలాన పనులు లేక పోయాయి నాకు. ఒక రోజు Blasting Plant మేస్త్రి వచ్చాడు. మామూలు కష్ట సుఖాలు అడిగాను.

"ఇంజనీరు గారు ఇంటి కెళ్ళే టప్పుడు మేడారం దగ్గర కొట్టారటగా మొన్న" అన్నాడు.

నేనేమీ అనలేదు.

"కారాపించి కొట్టారట. డ్రైవరు అడ్డు పోతే వాణ్ణి కొట్టారట. గౌరి గురించి ఏదో గొడవ జరిగిందటగా. గంగులూ, కూలీలు కలసి కొట్టారట. ఆయన ట్రాన్స్ఫర్ కోసం చూస్తున్నాడు.

కాంట్రాక్టరు ఈ విధంగా కక్ష తీర్చు కున్నాడన్నమాట.

మర్నాడు కాంట్రాక్టరు వర్క్‌షాపు దగ్గరికి వెళ్ళాను నేను.

"ఇంజనీరు గారికి ఈ ఊరు నీళ్ళు గిట్ట లేదటగా" భావ యుక్తంగా నవ్వాడు కాంట్రాక్టరు.

"ఎందుకని గిట్టలేదట?"

"అట్లాంటి వాళ్ళు ఎక్కువ కాలం ఒకే చోట ఉండ లేరు పాపం" అన్నాడు హేళనగా.

వర్షాల మూలంగా పని పూర్తిగా ఆపు జేశారు. నేను వర్క్ షాపు దగ్గరికి వెళ్ళ డమే మాను కున్నాను.

ఇంతలో ఇంజనీరు గారి ఇంటి దగ్గర నుండి కబురు వచ్చింది. ఒక్కసారి వచ్చి పొమ్మని. ఇంజనీరు గారు సెలవు పెట్టి వెళు తున్నాడుట!

కబురు అందిన సాయంత్రమే బయలు దేరి వెళ్ళాను. నన్ను చూస్తూనే ఆప్యాయంగా పలకరించారు. ఇటువంటి మహానుభావుల పట్ల దేవుడు ఎందుకు ఇంత నిర్దయగా ఉన్నాడో నాకు అర్థం కాలేదు.

భోజనానంతరం నన్ను తన గదిలోకి తీసు కెళ్ళారు. "అంతా తెలిసిందా నీకు?" అనడిగారు.

నేనేదో అన బోతున్నాను.

"నువ్వు కూడా అది నమ్ముతున్నావా?" అనడిగారు.

నాకు ఏం సమాధానం చెప్పాలో తోచ లేదు. ఆయన ముఖంలోకి చూస్తూ కూర్చున్నా, ఆయన ప్రక్కనే ఉన్న చెక్క బీరువా తెరిచి ఒక పాత డైరీ తీసి నాకిచ్చారు.

12-2-1959.

సరిగ్గా అమ్మాయి పోయి పదిహేను రోజులైంది.

ఇన్నాళ్ళూ డైరీ రాయడానికి చేతులు రాలేదు. ఈ రోజు ఎందుకో బుద్ధి పుట్టింది. ఆరోజు నిజంగా అమ్మాయి బంగారు బొమ్మలా ఉంది. వస్తువులన్నీ పెట్టుకుని ఆడు కోవడానికి వెళ్ళింది. ఇంట్లో ఆడపిల్ల తిరగటం చాలా ఆనందంగా ఉంది నాకు. ఆ ఆనందం ప్రొద్దు కూక కుండానే అంత రించింది. ఎవడో దుర్మార్గుడు నగల కోసం ఆశపడి రాధను చంపేశాడు. ఆ రోజుతో మా భాగ్యలక్ష్మి, అదృష్ట దేవత ఇల్లువిడిచి వెళ్ళి పోయింది. చంపిన వాణ్ణి దేవుడు శిక్షించక మానడు."

ఆ పేజీమీద కన్నీళ్ళు పడి కొన్ని అక్ష రాలు అలికి నట్లు తయారయ్యాయి. నాలోని అనుమానం ఇంకా తీరలేదు. అది మూసి టేబుల్ మీద పెట్టాను.

ఆయన గారు చెప్పటం ప్రారంభించారు-

"దానికీ దీనికి సంబంధం ఉంది. 'రాధ' పోలికలు ఆ 'గౌరి'లో ఉన్నాయి. ఆ పోలికల వల్లనే 'రాధ' బ్రతికి ఉందని భ్రమించాను. కాని నిజంగా అలా జరగలేదు. ఇలాగన్నా నా దుఃఖం పోతుందని తృప్తి పడదామనీ అనుకున్నాను. ఆ సంగతి 'గౌరి'కి కూడా తెలుసు. అదే నేను చెప్పాను. కానీ అపార్థం చేసుకోవడానికి నేనే చోటిచ్చానేమో! దేవుడు ఇలాగన్నా నేను తృప్తి పడటాన్ని సహించలేక పోయాడు. ఏంచేస్తాం" అన్నాడు.

అతన్ని చూస్తే జాలేసింది!

ఏ జన్మలో ఏ మహా పాపం చేశాడనీ, అతనికీ శిక్ష? *

## రచయితలు గమనించాలి...

ప్రజాతంత్రలో ప్రచురణకు స్వీకరించబడని రచనలు, తగిన పోస్టేజి జతపరిచినా తక్షణమే త్రిప్పిపంపడం సాధ్యపడదు. రచనల పరిశీలనకు కనీసం రెండు నెలలు వ్యవధి అవుసరమవుతుంది. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు కూడా అవకాశం వుండదు. సమాధానాలకోసం కార్డులు, ఇన్‌ల్యాండ్ కవర్లు పంపనవసరం లేదు. రచయితలు గ్రహించవలసిందిగా కోరుతున్నాం.

—ఎడిటర్